క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరీ ఆస్పత్రి వైద్య సిబ్బందితో బుధవారం నిరుపేద పిల్లలు, ఇంటి పనివారి పిల్లలు, టౌన్‌షిప్‌లోని ఇతర కార్మికుల పిల్లలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి డాక్టర్ పూజా చౌదరి పిల్లలందరికీ కళ్ల పరీక్షలు చేశారు. శిబిరంలో డాక్టర్లు సౌమ్యజోషి, లహరి, దీప్తి మహిళా సమితి ఉపాధ్యక్షురాలు ఉర్జస్వల దేశాయ్, పద్మశ్రీ, మంజులరెడ్డి, సుహాసిని పాల్గొన్నారు.

మహిళా మిత్ర చేయూత



నిత్యావసరాలు అందిస్తున్న చంద్రకళ

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన మేషన్ కూలీ కోడూరి రమేశ్ ఇటీవల మృతి చెందాడు. ఎన్టీపీసీలోని మహిళా మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మృతుడి తల్లి చంద్రమ్మ, కూతురు పల్లవికి బుధవారం రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు అందజేశారు. మమత, సింధు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు షురూ



మరమ్మతు చేస్తున్న కూలీలు

సుల్తానాబాద్: పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద బుధవారం రాజీవ్ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో రోడ్డు పలు ప్రాంతాల్లో దెబ్బతింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మరమ్మతు చేస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు.

బట్ట సంచులు పంపిణీ



బట్ట సంచులు పంపిణీ చేస్తున్న సేవాదళం

ఓదెల: ప్లాస్టిక్ నిషేధించాలని బట్ట సంచులు మాత్రమే వాడాలని కోరుతూ కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండలంలోని కొలనూర్‌లో బుధవారం బట్టసంచులు పంపిణీ చేశారు. మండలంలోని ఓదెల, కొలనూర్, కనగర్తి గ్రామాల్లో 500మందికి బట్ట సంచులు పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతల్ల కాంతయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, సందీప్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ తహసీల్దార్‌గా రజిత



సుల్తానాబాద్: సుల్తానాబాద్ తహసీల్దార్‌గా అంబటి రజిత బదిలీపై రానున్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో విధులు నిర్వహిస్తుండగా ఎన్నికల బదిలీల్లో భాగంగా సుల్తానాబాద్ తహశీల్దార్‌గా రానున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ యాకన్నను ఓదెలకు బదిలీ చేశారు.

అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి

కోల్‌సిటీ: అపోహలు వీడి అందరూ నేత్రదానానికి ముందుకు రావాలని సదాశయ ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాజమహేందర్‌రెడ్డి, రఘుపతి పిలుపునిచ్చారు. గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన సుద్దాల ఓదెమ్మ అలియాస్ రిబుక(60) అనే మహిళ గుండెపోటుతో ఇటీవల మృతి చెందింది. ఆమె నేత్రాలను ఐ బ్యాంకుకు దానం చేశారు. కాగా బుధవారం సభ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ నిర్వహించారు. కుటుంబసభ్యులను అభినందించారు. సుద్దాల మల్లేశ్-అరుణ, శ్రీనివాస్-శ్రీలత, సాయిశ్రావణ్, స్థానిక కార్పొరేటర్ మహంకాళి స్వామి, ప్రతినిధి దయానంద్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, రమేశ్, వాసు, రాజమౌళి పాల్గొన్నారు.

ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసేదెన్నడు?



వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

- గర్రెపల్లి పీహెచ్‌సీలో ప్రతీరోజు 80–90మందికి పైగా ఓపీ సేవలు
- 24గంటల వైద్యసేవలు అందించాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల ద్వారా 29గ్రామాలకు వైద్యసేవలు

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 సేవలు అందించేందుకు ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని పీహెచ్‌సీ పరిధిలోని ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు సర్వసభ్య సమావేశంలో పలుమార్లు తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) పరిధిలో సబ్ సెంటర్ల ఆధ్వర్యంలో 29 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి.

11 సబ్‌సెంటర్ల ద్వారా సేవలు..

గర్రెపల్లి పీహెచ్‌సీ పరిధిలోని 29 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. అందులో 11 సబ్ సెంటర్లు గర్రెపల్లి, మంచిరామి, గట్టెపల్లి, కొదురుపాక, సుద్దాల, రేగడిమద్దికుంట, కనుకుల, తొగర్రాయి, సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో పూసాల, యాదవనగర్, అశోక్‌నగర్‌లలో సేవలు అందిస్తుండగా మిగగా 18 గ్రామాల ప్రజలకు ఈ ఆసుపత్రిలోనే సేవలు వినియోగించుకుంటున్నారు.

57 రకాల వైద్యపరీక్షలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌లో సీబీపీ, థైరాయిడ్, హెచ్‌ఐవీ, టీబీ, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, ఫైలేరియా లాంటి 57 రకాల పరీక్షలు చేస్తున్నారు.

ఎన్‌యూసీఏఎస్‌ఎస్ కింద గుర్తింపు..

గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో నేషనల్ క్వాలిటీ కంట్రోల్ సొసైటీ(ఎన్‌యుసీఏఎస్‌ఎస్) కింద కేంద్రం గుర్తించి అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం రూ.3లక్షల నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులతో 75శాతం ఆసుపత్రి అభివృద్ధికి, 25శాతం ఆసుపత్రి సిబ్బందికి నిధులు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది.



గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రస్తుతం పనిచేస్తున్న వైద్య సిబ్బంది..

ఆరోగ్య కేంద్రంలో నలుగురు ఎంబీబీఎస్, ముగ్గురు ఆయుర్వేద వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, 17మంది ఏఎన్ఎంలు, 10మంది ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేస్తున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చేవారికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు.

24గంటల వైద్యసేవలు అందించాలి

ఆసుపత్రిలో ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 వరకు వైద్యసేవలు అందించగా ప్రతిరోజూ ఔట్ పెషెంట్(ఓపి) 80–90మందికి పైగా సేవలు అందించగా నెలకు రెండు చొప్పున డెలివరీలు జరుగుతున్నాయి. వైద్యులు అత్యవసర సమయాల్లో కరీంనగర్, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే 10–12 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో 24గంటల వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. సబ్ సెంటర్ల ద్వారా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడంతో పాటు నార్మల్ డెలివరీలో గర్రెపల్లి ప్రథమ స్థానంలో ఉంది.

– సృజన్, డాక్టర్, గర్రెపల్లి పీహెచ్‌సీ

తీర్మానం చేశాం



ఆసుపత్రి పరిధిలోని గ్రామాల ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశాల్లో 24గంటల వైద్య సేవలు అందించడాని అప్‌గ్రేడ్ చేయాలని తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు నివేధిక అందించాం. త్వరలోనే అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

– బాలాజీరావు, ఎంపీపీ, సుల్తానాబాద్

గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: గోదావరిబ్రిడ్జికి ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గోదావరిఖని సబ్ డివిజన్ ఏసీపీ తుల శ్రీనివాస్‌రావును సీపీఐ నగర కార్యదర్శి మద్దెల దినేశ్ కోరారు. బుధవారం ఆయనను కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మహత్యల నివారణకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు గోదావరిబ్రిడ్జి చుట్టూ రక్షణ కోసం ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



ఏసీపీ శ్రీనివాస్‌రావుతో సీపీఐ నాయకులు

స్కూల్ స్వీపర్ల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించండి

పెద్దపల్లిరూరల్: స్కూల్ స్వీపర్ల సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి అపరిష్కృత సమస్యలకు పరిష్కారం చూపి అండగా నిలవాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి స్వీపర్ల సంఘం నాయకులు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, రాజలింగం తెలిపారు. 30ఏళ్లకాలంగా స్వీపర్లు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని కోరారు. నాయకులు వెంకట్ స్వామి, లక్ష్మి, వెంకటి, చిన్నరాజయ్య, ఎస్.రాజయ్య, జి.స్వామి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాయకులు

బెస్ట్ రీజియన్ చైర్‌పర్సన్ మల్టిపుల్ అవార్డుకు ఎంపిక

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన అంజనాద్రి రీజియన్ చైర్‌పర్సన్ లయన్ సామ ఎల్లారెడ్డికి రాష్ట్ర స్థాయిలో బెస్ట్ రీజియన్ చైర్‌పర్సన్ మల్టిపుల్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ అవార్డు కార్యక్రమం జరిగింది. ధర్మారం లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లారెడ్డిని అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఎల్లారెడ్డి

సంక్షిప్త వార్తలు

✦రోడ్డు పనులు ప్రారంభించాలి

కోల్‌సిటీ: రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ బుధవారం కార్పొరేటర్‌తో పాటు డివిజన్ ప్రజలు రోడ్డు నిర్మాణానికి వేసిన మెటీరియల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రామగుండం 29వ డివిజన్ పరిధిలోని గోదావరిఖని జీఎం కాలనీ పార్కు ఎదుట కాలనీ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నిర్మాణం చేపట్టాలని సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో నాలుగు నెలలల క్రితం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టరుకు పనులు అప్పగించింది. 4నెలలైనా పనులు ప్రారంభించలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రహదారి మరింత శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేటర్ మహంకాళి స్వామి, స్థానికులు పాల్గొన్నారు.

✦పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పనిసరి

ఎలిగేడు: వానాకాలం సీజన్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయిచాలని మండల పశువైద్యాధికారి ఝాన్సీ అన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

✦బాధ్యతలు స్వీకరణ

జూలపల్లి: మండల తహసీల్దారుగా ఎండీ.బషీరోద్దీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లాలో పనిచేసి, బదిలీపై బాధ్యతల్లో చేరేందుకు వచ్చిన తహసీల్దారు ఎండీబషీరోద్దీన్‌కు డిప్యూటీ తహసీల్దారు అబూబాకర్, సీనియర్ అసిస్టెంట్ సదయ్య, ఆర్ఐ సంపత్, జూనియర్ అసిస్టెంట్ శేఖర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వలతో పాటు రంగంపల్లి, చందపల్లి, పెద్దపల్లిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

✦కూలీలతో పారిశుధ్య పనులు

పెద్దపల్లిరూరల్: కార్మికులు నిరవధిక సమ్మెకు దిగడంతో పంచాయతీ పాలకులు కూలీలతో పనులు చేయిస్తున్నారు. గ్రామాల్లో చెత్త, చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో దినసరి కూలీలతో పనులు చేయిస్తున్నామని కార్యదర్శి శంకరయ్య తెలిపారు.

✦తహసీల్దార్‌కు సన్మానం

ఓదెల: ఇన్నిరోజులు మండల తహసీల్దార్‌గా పనిచేసిన రమేశ్‌ను మంచిర్యాల్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కాగా బుధవారం మండల కేందంలోని ఫంక్షన్‌హాలులో సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐలు రాజేందర్, నర్సింగ్, వీఆర్ఏలు స్వామి, వెంకటేశ్వర్లు, అన్వర్, రాజు, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

✦బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు..

కమాన్‌పూర్: రామగిరి మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రామ్మోహన్ రావును బీఆర్ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాశం ఓదెలు, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాలు



నిత్యావసరాలు అందిస్తున్న సొసైటీ సభ్యులు

మంథని: మంథని ప్రాంతంలో వరదలకు ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన నిరుపేదలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, వంటసామగ్రి అందజేశారు. అలాగే పులిహోర ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు అందించారు. ఆర్డీవో హనుమంతు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, వైస్‌చైర్మన్ తూము రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి, శ్రీకాంత్, మేడగోని వెంకటేశ్, శ్రీనివాస్, దత్తగౌడ్, బుద్దార్థి సతీశ్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీఎస్పీ నాయకులు



పెద్దపల్లిరూరల్: బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె వెంట నాయకులు రాజు, గోపాల్ యాదవ్, అనిల్, ఎండీ రియాజ్, పల్లె ప్రశాంత్, నర్సయ్య, తిరుమల దాస్, సాదిక్ ఉన్నారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం

మంథని: మంథని పట్టణ స్వర్ణకార వృత్తి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా మోదుపురం విజయ్, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి నరేశ్ ఎన్నికై నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగు శ్రీనివాస్, రామోజురాజు తెలిపారు.

జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి

కమాన్‌పూర్: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో 7వ తేదీన జరిగే జాతీయ ఓబీసీ మహాసభను బీసీలు విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం చలో తిరుపతి పోస్టర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు పొన్నం నవీన్, మచ్చగిరి రాము, జంగిపెల్లి అజయ్, రంగు సత్యనారాయణ, సత్యం, రాజయ్య, విజయ్, నరేశ్, శ్రీనివాస్, ఓదెలు, మహేశ్, సదయ్య పాల్గొన్నారు.

పేద ప్రజల కోసమే కాకా ఫౌండేషన్

ధర్మారం: కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు సేవ చేసేందుకే కాకా ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీ కాకా ఫౌండేషన్ చైర్మన్ వివేక్ అన్నారు. ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో కాకా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం రూ.50వేల విరాళం గౌడ సంఘానికి అందించారు. కార్యక్రమంలో బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడే సూర్యానారాయణ, గౌడ సంఘం నాయకులు చేపూరి తిరుపతి, మల్లేశం, కృష్ణ, జంగిలి రాజయ్య, కోషోర్, బీజేపీ నాయకులు మల్లేశం, తిరుపతి, స్వామి పాల్గొన్నారు.



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న వివేక్

అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పద్మశాలీ సంఘం భవన నిర్మాణానికి మంజూరైన రూ.20లక్షలకు సంబంధించిన పత్రాన్ని సంఘం నాయకులకు అందించారు. సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

కేసీఆర్ పాలనలో ప్రజల కళ్లల్లో ఆనందం

గోదావరిఖని: సీఎం కేసీఆర్ పాలనలో ప్రజల కళ్లల్లో ఆనందం నెలకొందని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు సాగంటి శంకర్, దాతు శ్రీనివాస్, జంగంపల్లి సరోజన, కల్వచర్ల కృష్ణవేణి, దొంత శ్రీనివాస్, రాకం లత, కన్నూరి సతీశ్‌కుమార్, అయిత శివకుమార్, కోఆప్షన్ మెంబర్ వంగ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ముందుగా స్థానిక మార్కండేయకాలనీలోని రాజలక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకులు వంగర శ్రీనివాస్, బొబ్బిలి రాజేశ్, ఇందిరాదేవి, ఎంకే.స్వామి, రంగయ్య పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్‌లో శ్రీజననీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లు అద్దె కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రవి, జననీ మండల సమాఖ్య అధ్యక్షురాలు చంద్రకళ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చందర్

కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కలిశారు. ఈసాలతక్కళ్లపల్లి శివారులోని సమ్మక్క, సారలమ్మ జాతర సమీపంలో గల సర్వే నంబర్ 746, 747లో ఎకరం భూమిని మండల కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని కోరారు.

తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ

రామగుండం: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందిస్తూ, చదువులో రాణించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం తొలిమెట్టు. ఇందులో భాగంగానే బుధవారం అంతర్గాం మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. తెలుగు, గణితం, ఆంగ్లం ఒక్కో సబ్జెక్టుపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్‌రావు తెలిపారు. మండల నోడల్ అధికారి ఇరుగురాల ఓదెలు, డి.మల్లయ్య, వెంకటరమణ, జ్యోతి ఉన్నారు.

ధర్మారం పాఠశాలలో..

ధర్మారం: ధర్మారం జిల్లా పరిషత్ పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ సంయుక్తంగా ప్రారంభించారు. సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, మండల విద్యాధికారి ఛాయాదేవి, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి దామోదర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనురాధ, రిసోర్స్ పర్సన్ నూతి మల్లయ్య, శ్రీనివాస్, సీఆర్‌పీ కవిత, కుమారస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో సంపత్‌రావు

డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద బీజేపీ నాయకుల ఆందోళన

గోదావరిఖని: రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఫైవింక్లయిన్ ఏరియాలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం పేదలకు అందించాల్సిన ఇళ్లు ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికైనా వెంటనే డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర నాయకురాలు కౌశిక లత, నాయకులు పున్నం శశికుమార్, షాడో, మేకల శ్రీనివాస్, సిలివేరి అంజి, జరుపుల శ్రీను ఉన్నారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్టు

రామగుండం: బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం గోదావరిఖనిలో డబుల్ బెడ్రూం గృహాలను సందర్శించేందుకు వెళ్లే క్రమంలో పోలీసులు బీజేపీ ప్రతినిధులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఇందులో భాగంగానే రామగుండం పట్టణంలో పార్టీ సీనియర్ నాయకుడు కౌశిక లత, ఆయన సతీమణి స్థానిక కార్పొరేటర్ కౌశిక లతను రామగుండం ఎస్సై బోయ వెంకటస్వామి ఉదయమే గృహ నిర్బంధం చేశారు. దీనిపై కౌశిక హరి స్పందిస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. వీరితో పాటు అంతర్గాం మండల కేంద్రంలోని బీజేపీ నాయకులను అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

జూలపల్లి: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన సమ్మె బుధవారం 28వ రోజుకు చేరింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కార్మికులు నిరసన తెలిపారు. కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వైద్య సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఆసంపెల్లి బాణయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని 26 కుల సంఘాలు కాంపెల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మద్దతు ప్రకటించాయి. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్, కుల సంఘాల నాయకులు, జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రంలో బుధవారం పంచాయతీ కార్మికులు వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి కిందికి దించారు.

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని పంచాయతీ కార్మికులు సెంటినరీకాలనీలో బిక్షాటన చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.



పాలకుర్తి: వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్మికులు బుధవారం ఆవుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: జీపీ కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, నాయకులు రాజబాబు, గౌసుద్దీన్, సురేశ్, రాజేశ్వరి, లక్ష్మణ్, అంజి, లక్ష్మి, అనసూర్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

రామగుండం: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సర్పంచ్ స్వామి, కార్యదర్శి శ్యాం, మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, సర్పంచ్ గొల్లె కావేరి పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అవగాహన కల్పించారు. సర్పంచ్ మాంకాలి తిరుపతి, హెచ్‌వీ వసంత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి ఉన్నారు.



రామగుండం: గర్భిణికి సీమంతం